క్లుప్తంగా

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



పొన్నూరు: పట్టణం లోని సివిల్ కోర్టులో ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి ఏకా పవన్‌కుమార్ తెలిపారు. కోర్టులో శనివారం బార్ అసోసియేషన్ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేలా బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు సహకారం అందించాలని ఆయన కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



పొన్నూరు: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కెనరా బ్యాంకు జనరల్ మేనేజరు రమేష్‌బాబు సూచించారు. ములుకుదురు బ్రాంచ్ ఆధ్వర్యంలో మండలంలోని ఇటికంపాడులో ప్రధాన మంత్రి సురక్ష యోజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జీఎం రమేష్‌బాబు పాల్గొని మాట్లాడారు. కేవైసీ ప్రాధాన్యత, పీఎం సురక్ష యోజన పథకం ప్రయోజనాలు, బ్యాంకులో అందించే సేవలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జీఎం రాజ్‌కుమార్, డివిజన్ మేనేజర్లు కార్తీక్, మోహన్, బ్రాంచి మేనేజరు వెంకట్రావు, ఖాతాదారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సంగం డెయిరీ కార్మికుడు మృతి

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ రెండు వాహనాలు ఢీ కొన్న సంఘటనలో సంగం డెయిరీ కార్మికుడు అక్కడికక్కడే మరణించిన సంఘటన శనివారం జరిగింది. చుండూరు మండలం వలివేరు గ్రామానికి చెందిన ఆరమళ్ల గణేశ్వర రెడ్డి (58) గత 15 ఏళ్లుగా చేబ్రోలు మండలం వడ్లమూడి సంగం డెయిరీలో కాంట్రాక్టు కార్మికుడుగా పని చేస్తున్నాడు. అనారోగ్య సమస్యల కారణంగా కొద్ది రోజులుగా సంగం జాగర్లమూడిలోని చెల్లెలు ఇంటి వద్ద ఉంటున్నారు. అక్కడ నుంచి సంగం డెయిరీలో పనుల కోసం ప్రతి రోజు ఆటో, బస్సులో రాకపోకలు సాగిస్తున్నాడు. శనివారం ఉదయం ఆటోలో వడ్లమూడిలోని సంగం డెయిరీలో పనుల కోసం బయలు దేరాడు. మార్గం మధ్యలో చాణక్య హైస్కూల్ సమీపంలో ఎదురుగా వస్తున్న నిమ్మకాయల లోడ్‌తో ఉన్న మినీ లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో గణేశ్వరరెడ్డి రోడ్డుపై కిందపడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించాడు. మృతుని భార్య పార్వతి ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్‌ఐ వీరనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహా గణపతి సేవలో ఎమ్మెల్యే నసీర్



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్ రోడ్‌లో ఏర్పాటు చేసిన 99 అడుగుల మట్టి వినాయక విగ్రహానికి విశేష స్పందన వస్తోంది. పలువురు ప్రజా ప్రతినిధులు స్వామిని దర్శించుకుంటున్నారు. శనివారం కార్యక్రమాల్లో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ 99 అడుగుల మట్టి విగ్రహాన్ని సందర్శించి, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేని ప్రత్యేక ఆహ్వానంతో పూజారులు స్వామి వద్దకు తీసుకువెళ్లి, ఆయనతో పూజలు నిర్వహించారు. స్వామి ప్రత్యేకతలను కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు. ఆయన కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ నరేంద్ర, వైస్ చైర్మన్ రాజానాయుడు, సెక్రటరీ లక్ష్మారెడ్డి, జాకీర్, రామాంజనేయరెడ్డి, గంటా స్వామి, దుర్గారెడ్డి, హేమంత్, గణేష్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి దర్శనం నిలిపివేత



నగరంపాలెం: ఈనెల ఏడో తేదీ (ఆదివారం) చంద్రగ్రహణం సందర్భంగా బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి దర్శనం నిలిపివేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, అర్చకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం ఉదయం తొమ్మిది గంటల వరకు మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం సంప్రోక్షణానంతరం స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని చెప్పారు.

చద్ది అన్నం, కూరలే దిక్కు

- ఆగ్రహించిన తురకపాలెం గ్రామ ప్రజలు
- వెంటనే వెనక్కు పంపిన నిర్వహణదారులు

గుంటూరు రూరల్: తురకపాలెంలో ఇంటింటికీ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం భోజనాలు తామే అందిస్తామని.. ఇళ్లలో వంట చేసుకోవద్దని అధికారులు మైకుల ద్వారా అనౌన్స్ చేశారు. శనివారం ఉదయం టిఫిన్ ఒక రకంగా ఉందని, మధ్యాహ్నం భోజనాలు ఫరవాలేదని గ్రామస్తులు అంటున్నారు. అయితే, ఒకటి రెండు చోట్ల మాత్రమే భోజనం చేసేందుకు ఆసక్తి చూపారు. పలు చోట్ల పలుచగా చేసినట్లు కనిపించింది. ఇదిలా ఉంటే రాత్రి భోజనాలకు మధ్యాహ్నం మిగిలిన కూరలనే మరలా పంపారంటూ భోజనానికి వచ్చిన ప్రజలు ఆందోళన చేశారు. ఎస్సీ కాలనీలో చర్చి వద్ద ఏర్పాటు చేసిన టెంట్‌లో భోజనాల గురించి అనౌన్స్ చేయకపోవడంతో చేసేందుకు వెళ్లిన ప్రజలకు నిరాశే ఎదురైంది. అన్నం ముద్దగా ఉందని, కూరలు మధ్యాహ్నం మిగిలినవే పంపటంతో దుర్వాసన వస్తున్నాయని భోజనానికి వెళ్లిన ప్రజలు ఆందోళన చేశారు. దీంతో నిర్వాహకులు వెంటనే కూరలను తీసి వేశారు.

భోజనాలు పెడతామని చెప్పి సద్దికూరలు పెడతారా?

ఇళ్లలో వంటలు చేసుకోవద్దని అనౌన్స్ చేసిన మొదటి రోజునే సద్ది కూరలు పెట్టారని గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ఒక్క రోజులోనే భోజనాలే ఏ విధంగా పెడతారో అర్థమైందని ఆందోళన వ్యక్తం చేశారు. సద్ది కూరలు పెట్టి మనోభావాలను దెబ్బతీస్తున్నారని చర్చించుకున్నారు. ఈ మాత్రం దానికి మైకుల్లో అనౌన్స్ చేయడం ఎందుకని అంటున్నారు.



చద్ది కూరలు, అన్నం

బైబై గణేశా.. శుభములివ్వు గణేశా !

- శోభాయమానంగా ప్రత్తిపాడులో గణేశుని శోభాయాత్ర
- డీజేలు, కనకతప్పెట్లతో అట్టహాసంగా నిమజ్జనానికి తరలిన గణనాథుడు


ప్రత్తిపాడు: గణేశ్ నిమజ్జన మహోత్సవాలు ప్రత్తిపాడులో వైభవంగా జరుగుతున్నాయి. రెడ్డి యూత్ ఆధ్వర్యంలో స్థానిక రెడ్ల రామాలయం వద్ద కొలువుదీరిన గణనాథుడు నవరాత్రి వేడుకలను ముగించుకుని శనివారం నిమజ్జనానికి తరలివెళ్లాడు. గణనాథుడు మురిసిపోయేలా.. పుడమి పులకించేలా.. సూర్యుడు అస్తమించే వేళ, డీజేల మోతలు, తీన్‌మార్ తప్పెట్లతో యువతీ యువకుల కేరింతల మధ్య భారీ గణపతి నిమజ్జనానికి తరలాడు. వీధుల్లో గృహాల ముంగిటకు వచ్చిన గణపతికి మహిళలు వారులు పోసి హారుతులిచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

రాజన్న విగ్రహంతో..

గణేష్ శోభాయాత్రలో యువత కదంతొక్కారు. ఉరిమే ఉత్సాహాన్ని ప్రదర్శించారు. మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత వైఎస్ఆర్ విగ్రహంతో భారీ ఊరేగింపు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ రాజారెడ్డి ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ, స్టెప్పులేస్తూ ఉత్సాహాన్ని కనబరిచారు. వైఎస్సార్ సీపీ రంగులు, జెండాలు, రిబ్బన్లు, గొడుగులతో గాలిలోకి తిప్పుతూ అభిమానాన్ని చాటుకున్నారు. వైఎస్ జగన్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకాలు చేస్తూ 'మా నాయకుడు.. నువ్వేనన్నా' అంటూ రెట్టించిన ఉత్సాహాన్ని కనబరిచారు.

95వేలు పలికిన గణేష్ లడ్డూ

తొలుత స్థానిక రెడ్ల రామాలయం వద్ద వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో వినాయక లడ్డూకు వేలం పాట నిర్వహించారు. లడ్డూను దక్కించుకునేందుకు యువత, పెద్దలు పోటీ పడ్డారు. చివరికి గ్రామానికి చెందిన వెన్నపూస మాలకొండారెడ్డి రూ. 95 వేలకు దక్కించుకున్నారు. శోభాయాత్రలో పెద్దసంఖ్యలో యువతీ, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు రెడ్డియూత్ ఆధ్వర్యంలో శోభాయమానంగా జరుగుతున్న గణేశుని శోభాయాత్ర



ప్రత్యేక ఆకర్షణగా ఉన్న వైఎస్ఆర్ విగ్రహం



లడ్డూతో వి. మాలకొండారెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- పోలీస్ వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం
- మృతులు పొన్నూరుకు చెందిన దంపతులు

బాపట్ల టౌన్ : పోలీస్ వాహనం ఢీకొని ఇద్దరు మృతి చెందగా...మరో ముగ్గురికి గాయాలైన ఘటన పట్టణ శివారులోని హెరిటేజ్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బాపట్ల జిల్లా ఏఆర్ విభాగంలోని పోలీస్ వ్యాన్ డ్రైవర్ మనోజ్ అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నాడు. శనివారం రాత్రి 8 గంటల సమయంలో పోలీస్ వ్యాన్‌ను సర్వీసింగ్ నిమిత్తం బాపట్ల నుంచి గుంటూరు తీసుకెళ్తున్నాడు. ఫుల్లుగా మద్యం తాగి వాహనాన్ని నడుపుతూ పట్టణంలోని మూర్తి రక్షణ నగర్ సమీపంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న కె. తనూష్‌సాయి, లికిత్‌బాబు, సందీప్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో వీరి ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు కేకలు వేయడంతో వాహనాన్ని మరింత వేగంగా నడుపుతూ పొన్నూరు నుంచి బాపట్ల వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న దంపతులను ఢీకొట్టాడు. ఈ ఘటనలో దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను పొన్నూరు పట్టణంలోని శ్రీనగర్ కాలనీ, 6వ లైనుకు చెందిన కన్నటి మురళి, అతని భార్య లక్ష్మీతిరుపతమ్మగా గుర్తించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.



డ్రైవర్ మనోజ్



మురళి మృతదేహం



తిరుపతమ్మ (ఫైల్)



చికిత్స పొందుతున్న తనూష్ సాయి

విద్యాధర్‌కు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

గుంటూరు రూరల్: నగర శివారు చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర్‌కు ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యాజమాన్యం అభినందించింది. 31 సంవత్సరాల బోధనా అనుభవం కలిగిన విద్యాధర్ 29 మంది పీహెచ్‌డీ పరిశోధకులకు మార్గనిర్దేశంతో పాటు 88 పీజీ ప్రాజెక్టులు, 30 యూజీ ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తి చేశారు. ఆయన రచించిన 294 అంతర్జాతీయ పరిశోధన పత్రాలు ప్రసిద్ధ స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్ ఇన్‌డెక్స్‌డ్ ఫార్మసీ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ప్రస్తుతం ఆయన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫార్మసీ బోర్డు చైర్మన్, ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రధాన సంపాదకుడిగా సేవలందిస్తున్నారు. జెఎన్టీయూ హైదరాబాద్ నుంచి పీహెచ్‌డీ పొందిన ఆయన ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు (2022), ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు (2023)తో పాటు అనేక జాతీయ స్థాయి పురస్కారాలను అందుకున్నారు. ఐదు పేటంట్లకు గానూ మూడు మంజూరయ్యాయి. ఫార్మసూటిక్స్ విభాగంలో ఆరు పాఠ్యపుస్తకాలు రచించారు. అవార్డు అందుకున్న సందర్భంగా కళాశాల అధ్యక్షులు ఆర్. శ్రీనివాస్, కార్యదర్శి సి.ఎన్. శ్రీనివాస్, కోశాధికారి ఆర్. గోపాలకృష్ణ ఆయన్ను అభినందించారు.



సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న విద్యాధర్

కేవీకేకు జాతీయ స్థాయిలో ప్రశంసలు



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా శనివారం కేవీకేలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్‌కుమార్ మాట్లాడారు. తమిళనాడులోని వెల్లూరులో నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాల కేవీకే వార్షిక జోనల్ వర్క్‌షాప్‌లో గ్రామీణ యువతకు, విస్తరణ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల విభాగంలో జాతీయ స్థాయి ప్రశంసలు, ప్రశంసాపత్రాన్ని అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ డైరెక్టర్ జనరల్ ఐ.సి.ఎ.ఆర్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి ఉప కులపతులు, విస్తరణ సంచాలకులు, కృషి విజ్ఞాన కేంద్రాల కార్యక్రమ సమన్వయకర్తలు, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారని తెలిపారు.

అవార్డు గ్రహీత తేజోమూర్తికి సత్కారం

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రూరల్ డెవలప్‌మెంటు విభాగ అధ్యాపకులు, వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య దివ్య తేజోమూర్తిని శనివారం ఘనంగా సత్కరించారు. ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు పొందిన సందర్భంగా ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని శనివారం ఎన్ఎస్ఎస్ విభాగంలో నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి శాఖలో ఉత్తమ బోధనతో పాటు ఎన్ఎస్ఎస్ విభాగ కోఆర్డినేటర్‌గా అనేక సేవలందిస్తూ విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో వర్సిటీ ఎస్సీ, ఎస్టీ యూనియన్ అధ్యక్షులు కొలికపూడి కోటేశ్వరరావు, వికాస మాజీ సెక్రటరీ కావూరి శ్రీనివాసరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నంబూరు తాతయ్య, వర్సిటీ బాలుర వసతి గృహాల డెప్యూటీ వార్డెన్లు కె శశిధర్, ఎన్. బాబు, అధ్యాపకులు, శ్యాంసన్, కిశోర్ బాబు, బాలకృష్ణ, కిశోర్ బాబు, పరిశోధకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



తేజోమూర్తిని సత్కరిస్తున్న యూనియన్ నాయకులు, సిబ్బంది

ఉపాధ్యాయురాలు విజయకుమారికి సత్కారం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్న పొన్నూరు మండలం దొప్పలపూడి జెడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయురాలు రాచకొండ విజయకుమారికి అమరావతి రోడ్డులోని చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి శనివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. టెన్త్ ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధనతో పాటు పాఠశాలలో ఉత్తమ ఫలితాల సాధనలో విజయకుమారి విశేష కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.



పురస్కారం అందుకున్న విజయకుమారి, శాంతమూర్తి దంపతులు

కిట్స్ కళాశాలకు మూడు విభాగాల్లో అవార్డులు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ స్థాయిలో మూడు విభాగాల్లో అవార్డులు లభించినట్లు ప్రిన్సిపాల్ పి. బాబు తెలిపారు. బెస్ట్ స్టార్ట్ అప్ కంపెనీస్ రిజిస్ట్రేషన్స్ విభాగం, బెస్ట్ పేటెంట్స్ గ్రాంట్స్ విభాగంతో పాటు ఎలిజిబుల్ బ్రాంచెస్‌కి అక్రెడిటేషన్ పొందినందుకు గానూ మూడు విభాగాల్లో యూనివర్సిటీ స్థాయిలో కళాశాలకు గుర్తింపు లభించింది. జేఎన్‌టీయూకే 18వ వార్షికోత్సవంలో భాగంగా వీసీ సి.ఎస్.ఆర్.కె ప్రసాద్ కిట్స్ కళాశాల ప్రిన్సిపల్ బాబుకు అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయిలో మూడు విభాగాల్లో అవార్డులు సాధించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కళాశాలలో విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి పరిచే దిశగా శిక్షణ ఇస్తున్నామని వివరించారు. విద్యార్థులకు ఉద్యోగాలతో పాటు, నూతన ఆవిష్కరణలు చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు.



కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న యూనివర్సిటీ వీసీ

అక్షర శిల్పం అవార్డుల ప్రదానం

గుంటూరు రూరల్: నగర శివారులోని అడవి తక్కెళ్లపాడులో గల టాప్ కిడ్స్ పాఠశాలలో శనివారం రాఘవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 30 మంది అత్యుత్తమ ఉపాధ్యాయులకు అక్షర శిల్పం (క్యారెక్టర్ స్కల్ప్చర్) అవార్డుల ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డెప్యూటీ మేయర్ షేక్ సజిల మాట్లాడుతూ సీబీఎస్సీ సిలబస్ బోధిస్తూ, ఉన్నత ప్రమాణాలతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రశంసనీయులని తెలిపారు. రమేష్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత మాట్లాడుతూ ప్రాథమిక విద్య విద్యార్థి జీవిత భవనానికి పునాది అన్నారు. ఉపాధ్యాయులె ఓర్పు, ప్రావీణ్యత, సృజనాత్మకతతో విద్యార్థులను తీర్చిదిద్దగలిగితే వారు అద్భుత శిల్పాలుగా మారి దేశ నిర్మాతలుగా మారతారని చెప్పారు. పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ లతా థామస్ మాట్లాడుతూ చక్కటి క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యాబోధనతో పాటు క్రీడలు, కంప్యూటర్, స్కిల్ డెవలప్‌మెంటు వంటి ఉన్నత ప్రమాణాలతో గ్లోబల్ విద్యార్థులుగా రాణించేలా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రాఘవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాడభూషి రవికుమార్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలు అనురాధ మన్నే, టాప్ కిడ్స్ డైరెక్టర్ థామస్ సెబాస్టియన్, ప్రిన్సిపల్ కె. సజాత, వైస్ ప్రిన్సిపల్ ఎం. కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవార్డులు పొందిన ఉపాధ్యాయులతో డెప్యూటీ మేయర్ సజిల, పాఠశాల యాజమాన్యం

అమెరికా టారిఫ్ పెంపుపై నిరసన

పెదకాకాని: అమెరికా భారత్‌పై విధించిన టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ సుందరయ్య కాలనీలో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పెదకాకాని మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు భారత్‌పై బెదిరింపులకు దిగుతున్నారని, దీని వల్ల మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. ఆక్వా, టెక్స్‌టైల్, గార్మెంట్ తదితర ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోతాయని వివరించారు. ఏటా 2 వేల కోట్ల డాలర్ల విలువైన ఆక్వా ఉత్పత్తులు రాష్ట్రం నుంచి ఎగుమతులు అవుతున్నాయని పేర్కొన్నారు. వీటి ధరలు పడిపోవడంతో సముద్ర తీర ప్రాంతంలోని రొయ్యలు, చేపల రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంటారని పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలో స్పిన్నింగ్ మిల్లులపై ప్రభావం పడుతుందని, వీటిల్లో ఎక్కువగా మహిళా శ్రామికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీసాలపై నిబంధనలు కఠినతరం చేయడం, కాలపరిమితిని తగ్గించడం, జరిమానాలు విధించడం వల్ల ఎన్నో ఆశలతో ఉన్నత విద్యను అభ్యసించిన విద్యార్థుల కలలు పేకమేడల్లా కూలిపోతున్నాయని పేర్కొన్నారు. అమెరికా దురాగతాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చాక భారత ప్రయోజనాల్ని, దేశసార్వభౌమత్వాన్ని అమెరికాకి తాకట్టు పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా ఎన్నికల సమయంలో ఇళ్ల పట్టాలు ఇస్తామని వాగ్దానం చేసిందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లేసుకుని నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని ఆయన కోరారు. నిలువ నీడ లేని వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శి బి. బాబూరావు, బి. సాంబయ్య, ఆర్. వెంకటరమణ, ఏ నాగేశ్వరరావు, షేక్ మరింబి, షేక్ మస్తానమ్మ, సీతారావమ్మ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

బయో మెడికల్ వ్యర్థాలు ప్రమాదకరం



అవగాహన ఒప్పందం చేసుకుంటున్న కళాశాల సంస్థ ప్రతినిధులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన సదస్సును బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంటు కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో విజయవాడ సేఫ్ ఎన్విరాన్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వెలగపూడి వెంకటేశ్వరరావు పాల్గొని బయోమెడికల్ వ్యర్థాల సక్రమ నిర్వహణ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆసుపత్రులు, డయగ్నోస్టిక్ సెంటర్లు, రక్త బ్యాంకులు, ప్రయోగశాలలు, ఫార్మసీ విద్యా సంస్థల నుంచి ఉత్పత్తి అయ్యే రక్తం, శారీరక ద్రవాలు, వాడిన సూదులు, బ్లేడ్లు, గడువు ముగిసిన ఔషధాలు, రసాయన అవశేషాలు హానికర పదార్థాలని తెలిపారు. వీటిని సక్రమంగా నిర్వహించకపోతే ప్రాణాంతక సంక్రమణ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని చెప్పారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నియమాల ప్రకారం జీవ వైద్య వ్యర్థాలను నాలుగు రంగుల బ్యాగులు లేదా కంటైనర్లలో వర్గీకరించి సేకరించాలని తెలిపారు. పసుపు బ్యాగ్‌లో శరీర భాగాలు, బ్యాండేజీలు, గడువు ముగిసిన ఔషధాలు ఉంచి దహనం లేదా డీప్ బరియల్ చేయాలని సూచించారు. ఎరుపు బ్యాగ్‌లో కలుషితమైన ప్లాస్టిక్ వస్తువులు, గ్లాసెట్లు, సూదుల్లేని సిరంజీలు, గ్లోవ్స్ ఉంచి దహనం చేయాలని తెలిపారు. తెల్ల రంగు పంక్చర్ ప్రూఫ్ కంటైనర్‌లో సూదులు, బ్లేడ్లు, స్కల్పెల్స్ వంటి పదునైన వస్తువులు వేసి డ్రై సెరిలైజేషన్ చేయాలని చెప్పారు. నీలం కంటైనర్‌లో గాజు వస్తువులు, లోహ ఇంప్లాంట్స్ వేసి ఆటో క్లీనింగ్ చేసి రీసైక్లింగ్ చేయాలని వివరించారు. జీవ వైద్య వ్యర్థాల నిర్వహణలో ప్రధాన దశలు విభజన, సేకరణ, రవాణా, తాత్కాలిక నిల్వ (48 గంటలలోపే), శుద్ధి సురక్షితంగా తొలగింపు విధానాలను పాటించడం ద్వారా సంక్రమణ వ్యాధుల వ్యాప్తి నివారించవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామారావు నాదెండ్ల మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థులు, అధ్యాపకులు, వైద్య రంగానికి సంబంధించిన ప్రతి ఒక్కరికీ ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు, ప్రజా ఆరోగ్యానికి ఇవి కీలకమని తెలిపారు. కళాశాల, సేఫ్ ఎన్విరాన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల మధ్య పరస్పర సహకారం కోసం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.